

# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

## వరి ధాన్యం కొనుగోలు సజావుగా నిర్వహించాలి

**ఇతర రాష్ట్రాల ధాన్యం కొనుగోలు చేస్తే కఠిన చర్యలు**

**కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ హెచ్చరిక**

**గద్వాల ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నుంచి కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, అవకతవకలకు పాల్పడే వారిపై సస్పెండ్ వేటు తప్పదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. బుధవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో రబీ సీజన్ కు సంబంధించి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 87 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందని, ఈనెల 9వ తేదీ నుంచి కొనుగోలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రైతులు తాము పండించిన ధాన్యంను తమ కల్లాల వద్దే బాగా ఆరబెట్టుకుని వస్తే కొనుగోలు కేంద్రాల వద్ద ప్రత్యేకంగా ఆరబెట్టే అవసరం ఉండదన్నారు. ఈ విషయంలో సంబంధిత ఏఈవోలు అన్నదాతలకు అవగాహన కలిగించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని, వివిధ రిజిస్టర్‌లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా వరి ధాన్యం కొనుగోలు, మిల్లులకు రవాణా చేసిన వివరాల రిజిస్టర్లో ప్రతి అంశాన్ని పూరించాలని ఆదేశించారు. ధాన్యం రకం, మిల్లుకు పంపిన తేదీ, తేమశాతం, తదితర వివరాలన్నీ పక్కాగా నమోదు చేయాలన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశాక వారికి 24 గంటల్లోనే డబ్బులు వచ్చేలా అవసరమైన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నిర్దేశించిన క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనాలని, ఇతర రాష్ట్రాల ధాన్యం కొనుగోలు చేస్తే బాధ్యులపై సస్పెండ్ వేటు తప్పదని హెచ్చరించారు. ఇతరరాష్ట్రాల నుంచి కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం రాకుండా జిల్లాలోని ఎనిమిది చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, పౌర సరఫరాల జిల్లా అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, తదితరులు పాల్గొన్నారు.



బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

## సంక్షేమ వసతి గృహాలలో మెనూ అమలు తప్పనిసరి

**నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**నారాయణపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం తప్పనిసరిగా అందించాలని జిల్లాకలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలురవసతి గృహం, ఆనంద నిలయం (బాలికలవసతి గృహం)ల ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా బాలుర వసతి గృహంలో మరుగు దొడ్లు, గదులు, డైనింగ్ హాల్, పైకప్పు వంటి వసతులను పరిశీలించారు. వంటగదిలో సరుకుల నాణ్యతను తనిఖీచేసి, మెనూ బోర్డును పరిశీ లించారు. మెనూ ప్రకారం టిఫిన్, స్నాక్స్, రాత్రి భోజనం అందిస్తున్నారా అని హాస్టల్ వార్డెన్‌ను ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. వసతి గృహంలో సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆనంద నిలయం బాలికల వసతి గృహాన్ని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. వంటగదిలో సిబ్బందితో మాట్లాడి మెనూ అమలుపై ఆరా తీశారు. ప్రతిరోజూ ఖచ్చితంగా మెనూ ప్రకారమే విద్యార్థులకు ఆహారం అందించాలని కలెక్టర్ సూచించారు. అదనపు మరుగు దొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని వార్డెన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్, తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, వార్డెన్ నిర్మల పాల్గొన్నారు.



ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

## పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

**సాయి ఆరోగ్య సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విప్ యెన్నం**

**జయరామ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు అభినందన**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రధానలక్ష్యంగా, ఉచిత వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో సాయి ఆరోగ్య సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ఎంతో అభినందనీయమని విప్ యెన్నంశ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నగరంలోని బండమీది పల్లిలో సద్గురు శ్రీశ్రీశ్రీ మధుసూదన్‌సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్, వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ" మిషన్ జయరామ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించనున్న సాయి ఆరోగ్య సూపర్ -మిగతా3లో..

## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**గద్వాల ఏప్రిల్ 8, ప్రభాతవార్త;** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా బుధవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకాలు చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, గద్వాల తహసీల్దార్ హరికృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఈవిఎం గోడౌన్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అధికారులు

# యువతే వికసిత్ భారత్‌కు పునాది

**యుద్ధంతో ప్రపంచ దేశాలు ఆర్థికంగా క్షీణత**

**భారతదేశంపై యుద్ధ ప్రభావం లేదు..**

**కరోనా సమయంలో ప్రపంచ దేశాలకు ఆహారం ఔషధం అందించిన ఘనత మనది**

**మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ**



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో , ఏప్రిల్ 8, ప్రభాత వార్త :** భారతదేశ అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని మహబూబ్‌గర్ ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో "మేరా యువ భారత్-వికసిత్ భారత్ 2047" కార్యక్రమం భాగంగా రాష్ట్ర స్థాయి ఎన్ఎస్ఎస్ సెమినార్ (కాన్క్లేవ్)ను బుధవారం సెంట్రల్ లైబ్రరీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గం.లకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు భారీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ "వికసిత్ భారత్ 2047"లక్ష్యాన్ని సాధించడంలో యువశక్తి ప్రధానబలం అని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. యువతలో నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధిఅవకాశాల పెంపు, గ్రామీణాభివృద్ధిలో చురుకైన భాగస్వామ్యం అవసరమని ఆమె వివరించారు. ప్రపంచంలోని అనేక దేశాలు యుద్ధాల కారణంగా ఆర్థికంగా క్షీణిస్తున్న నేపథ్యంలో, భారతదేశం మాత్రం ప్రజల ఐక్యత, యువతశక్తితో అభివృద్ధిపథంలో దూసుకెళ్తోందని ఆమె అన్నారు. కరోనా సమయంలో ప్రపంచ దేశాలకు ఆహారం, ఔషధాలు, వైద్య సహాయం అందించిన ఘనత భారతదేశానిదేనని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య చైతన్యం, సామాజిక బాధ్యత వంటి రంగాల్లో ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ॥ జి.ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సెల్ రాష్ట్ర స్థాయి కార్యక్రమాలను నిర్వహించడం గర్వకారణమని తెలిపారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విశ్వవిద్యాలయాన్ని తెలంగాణలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. విశ్వవిద్యా లయంలో ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ లైబ్రరీలు, పరిశోధన అవకాశాల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సహకారం ద్వారా మరిన్ని నిధులు లభిస్తే యూనివర్సిటీ అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ॥ పి. రమేష్ బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. కే. ప్రవీణతో పాటు పీజీ కాలేజ్ ప్రిన్సిపల్ డా. డి. మధుసూదన్ రెడ్డి, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డా. ఎన్. చంద్ర కిరణ్, సీఈవో ఇన్స్పెక్ట్ హైదరాబాద్ డా. కే. శ్రీనివాస్, ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపల్ డా. సిహెచ్. రవికాంత్, పీజీ సెంటర్ కొల్లాపూర్ ప్రిన్సిపాల్ డా. మార్కపోలేనస్, పీజీ సెంటర్ గద్వాల్ ప్రిన్సిపల్ డా. చావా వెంకట్ రెడ్డి, డా. ఎస్. రవికుమార్, డా. బి.వి. రాఘవేందర్, డా. గాలెన్న, డా. ఎ. ఈశ్వర్ కుమార్, డా. చిన్నా దేవి, డా. ఎం. జ్ఞానేశ్వర్, డా. ఎస్.ఎన్. అర్జున్ కుమార్, డా. సుభాషిని, డా. స్వరూప బి.జగన్మోహన్, పీజీ సెంటర్స్ నుంచి వివిధ కాలేజీల నుంచి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ వాలంటీర్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పియు విసి శ్రీనివాస్



చెక్ డ్యాం ల నిర్మాణానికి శంకుస్థాపన

## సాగునీటి కష్టాలకు చెక్

**శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు**

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మూడు చెక్ డ్యాంల నిర్మాణానికి శంకుస్థాపన**

**హన్వాడ, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండలంలో రైతుల సాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా కీలక అడుగు పడింది. నీటిపారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ నిధులు రూ. 830.50 లక్షలతో మూడు చెక్ డ్యాంల నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఘనంగా శంకుస్థాపన చేశారు. ఇబ్రహీంబాద్ (రూ.227.50 లక్షలు), ముని మోక్షం (రూ.268 లక్షలు), వేపూర్ (రూ.335 లక్షలు) గ్రామాల్లో చెక్ డ్యాంల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి చెక్ డ్యాం నిర్మాణపు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చెక్ డ్యాంల ద్వారా ప్రాంతంలోని రైతులకు సాగునీటి కొరత గణనీయంగా తగ్గి, వ్యవసాయానికి స్థిరమైన నీటి వనరు అందుబాటులోకి రానుందన్నారు. భూగర్భ జలాలు మెరుగుపడటంతో పాటు పంటల దిగుబడులు పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర - మిగతా4లో..

## కెసిఆర్ ఉద్యమంతో ప్రాజెక్టుల కోసం పోరాటం

**గొల్లపల్లి సభకు న్యాయస్థానం అనుమతి**

**హరీష్ రావు పర్యటనతో ప్రభుత్వ గుండెల్లో గుబులు**

**ప్రజాధనాన్ని కాపాడడానికి గొల్లపల్లి సభ**

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి

**వనపర్తి, ఏప్రిల్8, ప్రభాతవార్త:** గొల్లపల్లిసభకు న్యాయస్థానం అనుమతి ఇవ్వడం నాయకులకు, అధికారులకు చెంపపెట్టు అని సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాజీ మంత్రి - మిగతా4లో..

## విద్యా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

**రూ.1.20 కోట్ల నిధులతో నిర్మించిన ఎస్సీ సంక్షేమ బాలికల హాస్టల్**

**తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**



హాస్టల్ ను ప్రారంభిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి ,ఎమ్మెల్యే మేగా రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి పట్టణంలోని పీర్లగుట్టలో నూతనంగా ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మించిన ఎస్సీ సంక్షేమ బాలికల హాస్టల్‌భవనాన్ని మంత్రి వాకిటి శ్రీహరి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవితో కలిసి ప్రారంభించారు. వీరితో పాటు వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి, డీసీసీబీ మాజీ ఛైర్మన్ మామిళ్లపల్లి విష్ణు వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ హాస్టల్ భవనం ఎంపీ లాడ్స్ నిధుల నుండి రూ.1.20కోట్ల వ్యయంతో నిర్మించబడినట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి మర్రికుంటలోని కేజీబీవీ పాఠశాలలో అదనపు మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు రూ. 80 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి వాకిటిశ్రీహరి ఎస్సీ సంక్షేమ హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థులు బాగాచదివి జీవితంలో ఉన్నత శిఖరాలను చేరాలని సూచించారు. ఎంపీ మల్లురవి స్వయంగా సాంఘిక సంక్షేమ హాస్టల్లో ఉండి చదువుకున్నారని, అందుకే సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు ప్రాధాన్యత ఇస్తూ నూతన భవన నిర్మాణానికి సహకరించారన్నారు. వనపర్తిలో ఇంత మంచి హాస్టల్ భవనాన్ని నిర్మించినందుకు ఎంపీని అభినందించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, విద్యార్థులు సైతం ఎంపీ మల్లురవికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, మున్సిపల్ ఛైర్పర్సన్ మాధవి, వైస్ ఛైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాతృ మరణాల నివారణకు చర్యలు

**గర్భిణులకు నిరంతరం వైద్య సేవలు అందించాలి**

**జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**మాతృ మరణాలపై సమీక్ష**



సమీక్షలో మాటట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్‌బ్యూరో, ఏప్రిల్8, ప్రభాతవార్త :** జిల్లాలో మాతృ మరణాల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం మాతృ మరణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఏప్రిల్ 2025 నుండి ఇప్పటివరకు జిల్లాలో మొత్తం ఏడుగురు గర్భిణులు ప్రసవ సమయములో వివిధ కారణాలతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మహబూబ్‌నగర్‌లో ఐదుగురు, పట్టణంలోని ఎస్ఎస్ హాస్పిటల్‌లో ఒకరు, హైదరాబాద్‌లోని గాంధీఆసుపత్రిలో ఒకరు మరణించడం జరిగిందని వైద్యశాఖ అధికారులు వివరించారు. సంబంధిత ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులకు, ఆరోగ్యసిబ్బందికి మాతృమరణాలు తగ్గించుటకు తగినచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో నమోదైన మాతృమరణాల పరిస్థితిని సమగ్రంగా విశ్లేషిస్తూ, వాటి కారణాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆమె స్పష్టం చేశారు. ప్రత్యేకంగా గర్భిణులకు సమయానుకూల వైద్యసేవలు అందించడం, హై రిస్క్ గర్భిణీలను ముందస్తుగా గుర్తించి ప్రత్యేకపర్యవేక్షణలో ఉంచడం కీలకమని కలెక్టర్ సూచించారు. గ్రామస్థాయిలో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గర్భిణీల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వఆసుపత్రుల్లో అవసరమైన సిబ్బంది, ఔషధాలు, పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అత్యవసర ప్రసూతి సేవలు అందించేందుకు 24 గంటల అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, రెఫరల్ కేసులనువేగంగా ఉన్నత వైద్యకేంద్రాలకు తరలించేవిధానాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి మాతృ మరణాన్ని సీరియస్‌గా తీసుకుని, దానిపై డీటైల్‌గా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని వైద్య అధికారులకు ఆదేశించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.కె.కృష్ణ సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే తీసుకుంటున్న చర్యలను వివరించారు. మెడికల్ ఆఫీసర్లు, ఇతర వైద్య అధికారులు సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. జిల్లాలో మాతృమరణాలను పూర్తిగా తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం ఆఫీసర్ డా.శివ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

**ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలి; రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి**

**నర్వ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్యశాఖ, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. నారాయణ పేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని నర్వమండల పరిధిలోని రాయికోడ్ గ్రామంలో రూ.3.12 కోట్లతో నూతనంగా మంజూరైన 33/11కేవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు మంత్రి వాకిటి శ్రీహరి గ్రామ సర్పంచ్ పుల్లరి శశికళ రవికుమార్, ఉప సర్పంచ్ మ్యాతరి గోపాల్ తో కలిసి బుధవారం భూమి పూజ - మిగతా4లో..



సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

## ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

**ఎమ్మెల్యేకు ఉదండాపూర్ వాసుల కృతజ్ఞతలు**



క్షీరాభిషేకం చేస్తున్న ఉదండాపూర్ వాసులు

**జడ్చర్ల, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** ఇచ్చిన మాట ప్రకారంగా ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఇచ్చే పరిహారాన్ని రూ.18 లక్షలకు పెంచి ఇప్పించినందుకు ధన్యవాదాలు చెబుతూ ఉదండాపూర్ కు చెందిన గ్రామస్తులు బుధవారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ఆయన పట్ల తమకు ఉన్న ప్రేమాభిమానాలను, కృతజ్ఞతలను చాటుకున్నారు. ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇదివరకు సింగిల్ ఫ్యామిలీ కింద రూ.6.5 లక్షలు, జాయింట్ ఫ్యామిలీ కింద రూ.16లక్షలు ఇస్తామని గతంలో ప్రకటించారు. అయితే ఈ పరిహారాన్ని పెంచి ఇప్పిస్తామని ఎన్నికలకు ముందే హామీ ఇచ్చిన అనిరుధ్ రెడ్డి ఆ తర్వాత తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత కూడా ఇదే మాటపై నిలబడ్డారు. ఈ విషయం గురించి సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పలుమార్లు సమావేశమై ఉదండాపూర్ నిర్వాసితుల పక్షాన నిలబడ్డారు. అనిరుధ్ రెడ్డి నిర్విరామంగా చేసిన కృషి ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఉదండాపూర్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇచ్చే పరిహారాన్ని రూ.18 లక్షలకు పెంచింది. దీంతో గతంలో రూ.6.5లక్షలు మాత్రమే వస్తుందనుకున్న వారికి కూడా ఇప్పుడు అదనంగా రూ.12 లక్షలు, అలాగే ఇదివరకు రూ.16 లక్షలు ఇస్తామన్న వారికి - మిగతా3లో..

## రావులపల్లిలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్


లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

**భూత్పూర్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం రావులపల్లి గ్రామంలో మూష కళమ్మకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం చేస్తున్న మూష కళమ్మ-చిన్న అంజనేయులు దంపతులకు ఎమ్మెల్యే జీఎంఆర్ నూతన వస్త్రాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామంలో ఎమ్మెల్యే జీఎంఆర్ సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తొండ శ్రీశైలంతో పాటు భూత్పూర్ మున్సిపల్ ఛైర్మన్ ముడావత్ బాలకోటి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొల్గర నర్సింహులు పలు గ్రామాల సర్పంచులు ఆనంద్‌రెడ్డి(పోతులమడుగు), మలిశెట్టి వెంకటేష్(కొత్తమొల్గర) కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలవర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ఎర్రవాపు నర్సింహులు, కరుణాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నలుగురు కోఆప్షన్ సభ్యుల పదవుల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ


భూత్పూర్ మున్సిపాలిటీ

**భూత్పూర్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** భూత్పూర్‌మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న నాలుగు(4) కోఆప్షన్ సభ్యుల పదవులను భర్తీ చేసేందుకు మున్సిపల్ కమిషనర్ పి చంద్రశేఖర్‌రావు నోటిఫికేషన్ జారీ చేశారు. మొత్తం నాలుగు కోఆప్షన్ పదవులలో రెండు మహిళకు కేటాయించినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన ఇరువిరిలో ఒకరికి మహిళకు రిజర్వు కాగా, మిగిలిన ఒక స్థానం పురుషునికి వర్తిస్తుందని తెలిపారు. అల్ప సంఖ్యాక వర్గాలలో ముస్లిం, క్రిష్టియన్, సిక్కు, బుద్దీస్, పార్సిస్ తదితర సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు ఈ పదవులకు అర్హులని పేర్కొన్నారు. ఇక మున్సిపాలిటీ పరిపాలనా విభాగంలో ఐదేండ్ల పూర్వానుభవం కల్గిన 21ఏళ్లు నిండిన వ్యక్తుల నుంచి రెండు కోఆప్షన్ సభ్యుల పదవుల కోసం అభ్యర్థనలు స్వీకరిస్తున్నట్లు కమిషనర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. పూర్వానుభవాలను పరిశీలిస్తే మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్, వార్డు సభ్యుడిగా మున్సిపాలిటీ పరిపాలనా విభాగంలో కనీసం ఐదేండ్ల అనుభవం కల్గి ఉన్న వ్యక్తులు కోఆప్షన్ సభ్యుల పదవులకు అర్హులని పేర్కొన్నారు. ఇరువురిలో ఒకటి మహిళకు కేటాయిస్తుండగా, మరొకటి పురుషునికి కేటాయించినట్లు కమిషనర్ పి చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఆసక్తికల్గిన అభ్యర్థులు ఈనెల 13న సాయంత్రం 5గంటలలోపు తమ కార్యాలయంలో దరఖాస్తుచేసుకోవాలని భూత్పూర్ మున్సిపల్ కమిషనర్ సూచించారు.

## కేఎల్ఐ కాలువలో పడి విద్యార్థి మృతి


రవికుమార్ ( ఫైల్ )

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** కేఎల్ఐ కాలువలో పడి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన పులి రవికుమార్ (16) తోటి స్నేహితులతో కలిసి మంగళవారం గ్రామంలో ఉన్న కేఎల్ఐ కాలువలో ఈత కోసం వెళ్ళగా, కేఎల్ఐ కాలువలో నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఆ నీటి తాకిడికి తట్టుకోలేక కాలువలో కొట్టుకొనిపోయాడు. సమాచారం తెలుసుకున్న మృతుడి తల్లిదండ్రులు పులి మాసయ్య శశికళ నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కెఎల్ఐ కాలువలో గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పాఠశాలలో ఘనంగా హస్తకళల ప్రదర్శన


హస్తకళల ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

**శ్రీరంగాపూర్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** పీఎం శ్రీ శ్రీరంగాపూర్ పాఠశాలలో ఘనంగా ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మేళా నిర్వహించారు. రంగురంగుల బంక మట్టితో విద్యార్థులు సృజనాత్మకంగా వివిధ కళారూపాలు చేసి ప్రదర్శించారు. రంగు రంగుల పేపర్, ఛార్ట్‌లతో వివిధ చిత్రాలు గీసి రంగులు వేసి ప్రదర్శించారు. వివిధ రంగుల పేపర్లతో కళాత్మకంగా వివిధ గృహోపకరణ వస్తువులు తయారు చేశారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మేళాలో విద్యార్థులు ఎంతో ఆసక్తితో తయారు చేసిన వివిధ కళాత్మక ఆకృతులు చూపరులను మంత్రముగ్ధుల్ని చేశాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహన్ రాజు మాట్లాడుతూ కళాత్మకవిద్య విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వసంతపురం రాజు, దామోదర్‌బాబు, సమీన్ బేగం, బీసీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉర్దూ మీడియం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు తస్లీమ్ బేగం, ఎస్సీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ప్రీ ప్రైమరి స్టాఫ్ ప్రకృతమ్మ, రత్నమాల పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి పేదలకు వరం..

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**


ఎల్ఓసిని అందజేస్తున్న ఎమ్మెల్యే గ్రామ సర్పంచ్

**దేవరకద్ర,ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** సీఎం సహాయనిధి ఎంతో మంది నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. కౌకుంట్ల మండలానికి చెందిన పాపిగాని చంద్రయ్యకి హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో గుండె సంబంధిత శాస్త్రచికిత్స నిమిత్తం 2,50,000 వేల విలువగల ఎల్ఓసిని గ్రామ సర్పంచ్ నరేష్ కుమార్, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా పాపిగానీ చంద్రయ్యకి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేదలకు నిజమైన వరంగా నిలుస్తుంది అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అత్యవసర వైద్యం, శాస్త్ర చికిత్సలు, ఇతర అవసరాల కోసం ఈ సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. పేద ప్రజలకు భారంగా మారే వైద్య ఖర్చులను తగ్గిస్తూ వారికి జీవనాధారంగా నిలుస్తుంది. ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయంతో అనేక కుటుంబాలు నూతన ఆశలు పొందుతున్నాయి అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. అనంతరం లబ్ధిదారులు కష్టకాలంలో వైద్య సహాయం అందించినటువంటి సీఎం రేవంత్ రెడ్డికి, దేవరకద్ర ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబిసి అధ్యక్షులు అంజనేయులు, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు కురువ కొండన్న, కౌకుంట్ల టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## వందరోజుల పని దినాలు కల్పించాలి

**వెల్దండ,ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనిలో 100 మంది కూలీలు తక్కువ కాకుండా కూలీలకు పని కల్పించాలని ఎంపీడీఓ కృష్ణయ్య పేర్కొన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులతో వారాంతపు సమీక్ష సమావేశాన్ని ఎంపీడీఓ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో త్రాగునీరు నీడ కొరకు టెంటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని, ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిలో గృహప్రవేశాలు ఎక్కువ మొత్తంలో జరిగేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో పారిశుద్ధం, త్రాగునీరు నిర్వహణలో నిరక్ష్యంగా ఉండరాదని, నర్సరీల నిర్వహణ సమర్ధంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, ఏపిఓ ఈశ్వర్‌జీ, హౌసింగ్ ఏఈ పల్లవి, ఏపీవో దేవేందర్, ఈసీ కుమారి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## మండల పార్టీ అధ్యక్షుడికి ఘనంగా సన్మానం

**ఉప్పునుంతల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా, కంసానిపల్లి మాజీ సర్పంచ్ సీనియర్ న్యాయవాది కర్నే లక్ష్మీనారాయణగా టి పిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా అందుకున్నారు. దీంతో కంసానిపల్లి గ్రామ సర్పంచ్ చీమర్ల లలిత వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ పోల జితేందర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, అభిమానులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. వారితో పాటు గ్రామానికి బయ్య శ్రీనివాసులు, మధు, శ్రీను, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల కోసమే గొల్లపల్లి.. చీర్కపల్లి రిజర్వాయర్ నిర్మాణం

**దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి**

**పని లేక ప్రాజెక్టులపై రాజకీయాలు**

**అఖిలపక్ష ముసుగులో బిఆర్ఎస్ దొంగ దీక్షలు**


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండలాల ఇంచార్జ్ సత్యశీలారెడ్డి, పార్టీ నాయకులు

**రేవల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** ఏదుల మండలం గొల్లపల్లి .. రిజర్వాయర్ నిర్మాణ కోసం సర్వేలు చేసి గొల్లపల్లి రిజర్వాయరును నిర్మించ తలపెట్టిన గత బిఆర్ఎస్ పార్టీ నేడు రిజర్వాయరును నిర్మించొద్దంటూ అమాయకమైన ప్రజలతో ధర్నాలు చేస్తూ తెరచాటు రాజకీయాలు చేస్తుందని గోపాల్‌పేట ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సత్య శీలారెడ్డి విమర్శించారు. ఆయన మాట్లాడుతూ నాడు నచ్చిన, మెచ్చిన గొల్లపల్లి..చీర్కపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకోవడం మీ నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనమని వారు విమర్శించారు. బుధవారం ఏదుల మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి గోపాల్‌పేట, రేవల్లి ఏదుల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని మాట్లాడారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో ఉన్న నీటిని ఎత్తిపోసుకోవడానికి మనకు ఆన్లైన్ రిజర్వాయర్లు అవసరమని, గొల్లపల్లి చీర్కపల్లి గ్రామాల మధ్యన గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మిస్తే సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని గత బిఆర్ఎస్ ప్రభుత్వం 21/10/2016 రోజున సర్వే నిర్వహించిన గత పాలకులు వారికి స్వలాభం చేకూరకపోవడంతో నేడు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మాజీ మంత్రి హయాంలో అన్ని పదవులు ఆయనే చేసేవాడనీ అదే క్రమంలో దాదాపుకోట్ల రూపాయల ఖర్చుతో అప్పట్లో ఈ గొల్లపల్లి రిజర్వాయర్ కు సంబంధించిన సర్వే పూర్తి చేయించాడని వారు తెలిపారు. ఆ రోజేమో ఎవరు చేయలేదు నేనే చేశాను అని వారికి వారే పొగుడుకున్న మాజీమంత్రి నేడు నేను కాదని నీతిమాలిన మాటలు మాట్లాడుతూ దిగజారుడు రాజకీయం చేస్తున్నాడన్నారు. ఏదుల రిజర్వాయర్లో భూములు కోల్పోయిన వారికి నాలుగు ఐదు లక్షలు ఇప్పించి అన్ని దొంగ హామీలు ఇచ్చి వారిని మోసం చేశాడన్నారు. ఆరోజున మాజీ మంత్రి చేస్తున్న పనులకు వెనకాల చప్పట్లు కొట్టిన కొంతమంది నేడు మళ్లీ అదే మాజీ మంత్రి అండతో దొంగ దీక్షలు చేయడం విడ్డూరమన్నారు. 20 రిజర్వాయర్లలో 6 రిజర్వాయర్లు వనపర్తి నియోజకవర్గం పరిధిలో ఉన్న ఆయకట్టుకు నీరు అందించేందుకు ఉపయోగపడతాయని నిరంజన్ రెడ్డి అన్నారు. ఇక్కడ గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం జరుగుతుందని గ్రామాలలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు 259 సర్వే నెంబర్లు దాదాపు 83 ఎకరాలు దొంగ పట్టాలు చేసుకుని ప్రాజెక్టు నిర్మిస్తే డబ్బులు వచ్చే విధంగా ముందస్తు ప్లాన్‌తో మీ బినామీలకు పట్టా చేసిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో వారి భూములన్ని ప్రభుత్వం తిరిగి జప్తు చేసింది. దానితో అదే మంటతో నేడు దొంగ దీక్షలు నిర్వహిస్తున్నారని వారు తెలిపారు. ఈ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి స్వయంగా తనే వచ్చి ప్రజల అనుమతి లేకుండా ఎటువంటి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టము అని తెలియజేసి తన నిబద్ధత చాటుకున్నారని వారు పేర్కొన్నారు. ఏదుల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సుకేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అన్నదమ్ముడిలా సేవ చేస్తున్న ఎమ్మెల్యేను పట్టుకొని నానా మాటలు అంటున్నారని పార్టీ కార్యకర్తలను కించపరుస్తున్నారని ఆయన హుందాగా మౌనంగా ఉంటున్నామని మేము చేతగాని వారిమి కాదని ఎమ్మెల్యే ఆదేశాల మేరకే మౌనంగా ఉంటున్నామని తెలిపారు. ఏదుల గ్రామ సర్పంచ్ పరుశురాములు మాట్లాడుతూ ఏదుల ప్రాజెక్టు నిర్మించినప్పుడు మా గ్రామ ప్రజల నుండి వ్యతిరేకత రాకుండా వ్యవసాయం చేసుకొని ప్రజలు బాగుపడతారని ఉద్దేశంతో వారిని ఒప్పించి మీరు ఇచ్చిన హామీలను నమ్మి మోసపోయామన్నారు. మల్లన్నసాగర్ లో భూములు కోల్పోయిన వారికి 12 లక్షల రూపాయలు ఇచ్చి మా ప్రాంతంలో భూములు కోల్పోయిన రైతులకు నాలుగైదు లక్షలు ఇచ్చి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుద్ధారం రిజర్వాయర్ ఏదుల రిజర్వాయర్ కన్నా ఎత్తులో ఉన్నప్పుడు ఎదుల దగ్గర ఏర్పాటు చేసిన తూము ద్వారా నీళ్లు ఎలా పైకి వెళ్తాయని ప్రశ్నించారు. చీరకపల్లి గ్రామ సర్పంచ్ రవి మాట్లాడుతూ గొల్లపల్లి గ్రామ శివారులో చేస్తున్న దీక్ష అఖిలపక్ష దీక్షనా అని ప్రశ్నించారు. అఖిలపక్ష వేదిక అని దొంగ దీక్ష చేస్తూ ప్రజలను మోసం చేస్తూ ఆ ముసుగులో బిఆర్ఎస్ పార్టీ నాయకులు దీక్ష చేస్తున్నారని తెలిపారు. చీర్కపల్లి బిఆర్ఎస్ పార్టీ లీడర్ దొడ్ల రాములు ప్లాటుకు పదివేల రూపాయలు వసూలు చేసి గ్రామంలో ప్లాట్లు ఇచ్చారని సర్వేనెంబర్ 76లో రెండు ఎకరాలు ఆయన బినామీలకు ఇంకా కొంతమందికి దొంగ పట్టాలు చేశాడని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్య శీలా రెడ్డి, సుఖేందర్ రెడ్డి, సత్య రెడ్డి, జయపాల్ రెడ్డి , వాడల పర్వతాలు, పరశురాములు, రవి, జానకి ,రాములు ,వెంకటస్వామి, జమ్మి మల్లేష్, వివిధ గ్రామంలో సర్పంచ్ లు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరికలు


మంత్రి శ్రీహరి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

**నర్వ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై పలువురు సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలంగాణ రాష్ట్ర మంత్రి డా. వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మక్తల్ నియోజకవర్గ కేంద్రం లోని మంత్రి అధికారిక నివాసంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నర్వ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్య ఆధ్వర్యంలో నర్వ మండల పరిధిలోని కల్వాల గ్రామ సర్పంచ్ చెన్నప్ప, ఉపసర్పంచ్ యాదమ్మ కురుమూర్తితో పాటు వార్డు సభ్యులు గణేష్, ప్రమీలమ్మ రవి కాంగ్రెస్ పార్టీలో చేరగా మంత్రి కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారందరు కాంగ్రెస్ నిబంధనకులకు అనుగుణంగా ఉంటూ వారివారి గ్రామాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు పార్టీ అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. కాంగ్రెస్‌పార్టీ పట్ల నమ్మకంతో అనేక మంది ఇతర పార్టీల నుంచి పార్టీలోకి వస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన సర్పంచ్ చెన్నప్ప మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా గ్రామ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీతో కలిసి ముందుకు సాగుతానని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డి.కృష్ణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు జగదబిరాంరెడ్డి, ఇతర నాయకులు నాగన్నగారి శ్రీనివాస్ రెడ్డి, నాగన్నగారి వివేకవర్ధన్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ గౌడ్, కల్వాల కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్ రెడ్డి, చంద్రకాంత్, నరసింహ, వాకిటి అశోక్, రామాంజనేయులు, నజీర్ పాషా, సతీష్ కుమార్, గోవర్ధన్, ఉండెకోడ్ కొండప్ప, రామలింగం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వంతో ఆర్థిక సహాయం

**ఉప్పునుంతల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** సమస్య ఉందంటే గాలిలో వాలే నాయకుడు, అందరినీ కలుపుకునే మానవత్వం కలిగిన యువ నాయకుడు, సామాజిక వేత్త, యుపిఎస్ పాఠశాల దత్తత తీసుకున్న సాదే రాజు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. అచ్చంపేట పట్టణానికి చెందిన గౌరీ ప్రసాద్ గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యం బారిన పడ్డాడు. విషయం తెలుసుకున్న మనసున్న మారాజు సాదే రాజు అనారోగ్యానికి గురైనా గౌరీ ప్రసాద్ ను పరామర్శించి రూ. 70 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మంచి మనసుతో మానవత్వంతో ఆర్థిక సహాయం అందించిన సాదే రాజుకు కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## పెనిమిళ్ళ నుంచి గొనకొల్ రోడ్డు పనులు చేపట్టాలని సర్వే


రోడ్డు పరిశీలించిన పిఆర్ ఎఇ మహేష్, నాయకులు

**ఉప్పునుంతల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** మండలంలోని పెనమెళ్ళ గ్రామం నుంచి గోనకల్ వరకు రోడ్డు పనులు చేపట్టాలని సర్పంచ్ మెడ సాని శ్రీలత విజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్ ఎఇ మహేష్ రోడ్డు ను పరిశీలించారు. ఈ మార్గం గుండా డిండి వెళ్లడానికి వీలుంటుందని గ్రామ సర్పంచ్ మెడసాని శ్రీలత విజేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## మండల అధ్యక్షుడిగా నియమితులైన అయ్యూబ్ పాషాకు సన్మానం



**ఊర్కొండ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** ఊర్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రేవల్లి గ్రామానికి చెందిన అయ్యూబ్ పాషా నియమితులైన సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని డిఎన్ఆర్ కార్యాలయంలో పార్టీ నాయకులు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయాబ్ పాషా మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన పెద్దలకు, సహకరించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకొని పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ద్యాప నిఖిల్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రమేష్ నాయక్, ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు పోలె రాజు, సర్పంచులు రుక్మారెడ్డి, మహేష్, బంగారు, శైలజ శ్రీశైలం, అంజమ్మ హనుమంతు, కాంగ్రెస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు గుంజ ఆదినారాయణ, నాయకులు అబ్దుల్ సమి, గోపాల్, వహీద్, ఖాజా మైనోద్దీన్, శేరిబాబా, మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్, రాజు, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## వర్షాకాలం వచ్చే నాటికి బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**


బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

**వెల్దండ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని గానుగట్టు తాండ గ్రామానికి వెళ్లే వాగుపై ఇంతకుముందు నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉండడంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బ్రిడ్జిపై ప్రత్యేక దృష్టి సారించి రూ.4కోట్ల 25 లక్షల నిధులను విడుదల చేయించి నూతన బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టారు. బుధవారం నూతనంగా నిర్మిస్తున్న నిర్మాణ పనులను ఎమ్మెల్యే కసిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వానకాలం నాటికి బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని, కాంట్రాక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు యెన్నం భూపతిరెడ్డి, డీఈ బసవలింగం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరికిషన్ నాయక్, ఏఈ సురేందర్ రెడ్డి, సర్పంచ్ మోనిక లచ్చిరాంతో పాటు తదితరులు ఉన్నారు.

## తాలూకా పాస్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు


అచ్చంపేట డివిజన్ పాస్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**ఉప్పునుంతల,ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** అచ్చంపేట డివిజన్ పాస్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని అచ్చంపేట క్రిస్టియన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఎంబి షాలెం చర్చిలో ఏర్పాటుచేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అచ్చంపేట డివిజన్ పాస్టర్ల సంఘం అధ్యక్షులుగా ఆశీర్వాదం (దోమల పెంట)ను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అబ్రహం, ఉపాధ్యక్షులుగా మార్టిన్, లూథర్, జూన్ సొలొమోను, ప్రధానకార్యదర్శిగా షాలెం రాజు, సహాయ కార్యద ర్శులుగా ఆర్ వెంకటయ్య, సంధ్యారాణి లను ఎన్నుకున్నారు. అలాగే ఆర్థిక కార్యదర్శిగా సుజ్ఞాని, ఆడిటర్ క్రిస్టఫర్, షాలెం రాజులను నియమించారు. కమిటీ సలహాదారులుగా ఏలియా, ఆనంద్, రాజు, శ్రీను, రామస్వామి, పరంజ్యోతి, సత్యం, తిమోతి, శామ్యూల్, ఎలియాజర్‌లను నియమించారు. క్రమశిక్షణ కమిటీసభ్యులుగా దినకర్, సురేష్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట క్రిస్టియన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు మీసాల సుధాకర్, సెక్రెటరీ బొంత ప్రభాకర్, సుందర్ రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, ఎంబి షాలెం, చర్చి చైర్మన్ జేమ్స్‌లు ఎన్నికయ్యారు.

## యంనోని పల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

**ధన్వాడ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని యంనోని పల్లి గ్రామంలో ఎనర్జీస్ నిధుల కింద రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డుకు శుభారంభం జరిగింది. ఈ కార్యక్రమాన్ని నారాయణపేట ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు మాధవరెడ్డి, మండల అధ్యక్షులు కావలి నరహరి, గ్రామ సర్పంచ్ బోయ నాగేశ్వర్, ఉపసర్పంచ్ సిద్ధప్ప కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి ఇటువంటి పనులు ఎంతో దోహదపడతాయని వారు తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ఈ రోడ్డు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ నర్సింలు, బోయ పెద్ద నర్సింలు, నక్కరాజు, మల్లేష్, బోయ తిమ్మయ్య , నవాబ్ మియా, చైర్మన్ నర్సింలు తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ధన్వాడలో నిషేధిత గుట్కా ప్యాకెట్ల పట్టివేత : ఎస్సై వెంకటేష్ గౌడ్

**ధన్వాడ,ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** ధన్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు ఒక ప్యాసింజర్ ఆటోను ఆపి పరిశీలించారు. ఈ తనిఖీలలో ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లు రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, అతను మహబూబ్‌నగర్‌కు చెందిన ఎండి హబీబ్ (తండ్రి: ఎండి జాంగిర్)గా గుర్తించారు. అతని వద్ద సుమారు రూ.6,845 విలువైన గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ధన్వాడ ఎస్సై వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రభుత్వ నిషేధిత అంబర్ జర్ద గుట్కా ప్యాకెట్లు ఎవరైనా నిల్వ ఉంచినా, రవాణా చేసినా, విక్రయించినా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని సన్మానించిన ఈదులపల్లి శ్రీనివాస్


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

**వెల్దండ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల కమిటీలకు నియమితులైన జిల్లా ఉపాధ్యక్షులు యెన్నం భూపతిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరికిషన్‌నాయక్‌లను కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఈదులపల్లి శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు వస్తుందని, పార్టీ పదవులు దక్కుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ వెంకటయ్య, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య, ఎండి రషీద్, గజినీ, శ్రీను, లక్ష్మణ్‌నాయక్, గోపాల్, రవీందర్, కిషన్‌లు ఉన్నారు.

## ప్రయాణికులు జాగ్రత్తలు పాటించాలి

**షీ టీమ్ పోలీసులు**

**మద్దూరు,ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ డా. వినీత్ ఆదేశాలమేరకు మద్దూరు బస్టాండ్‌లో షీటీమ్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణికులు బస్సుల్లో ఎక్కే, దిగే సమయంలో తమ విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. మహిళలను ఎవరైనా వేధించినా వెంటనే 8712670398 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అపరిచితుల తినుబండారాలు తీసుకోరాదని, మాయమాటలు నమ్మి నగలు, డబ్బులు ఇవ్వవద్దని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే నేరాలు నివారించవచ్చని షీ టీమ్ అధికారి చెన్నప్ప తెలిపారు. ఈకార్యక్రమంలో షీటీమ్ సిబ్బంది, కవిత, జ్యోతి, బాలరాజ్ స్థానికులు పాల్గొన్నారు.

# మరింత ఉత్సాహంతో పని చేస్తాం

◆ 2029లో అధికారం సాధించే దిశగా అడుగులు ◆ డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్



**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** డీసీసీ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డీసీసీ కమిటీ నూతన కార్యవర్గం కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని కమిటీ సభ్యులకు నియామక పత్రాలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకం అయిన తర్వాత మహబూబ్ నగర్ కు మొదటిసారిగా వచ్చిన మహేష్ కుమార్‌గౌడ్‌కు స్వాగతం పలకడానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. డీసీసీ కమిటీ నియామకంతో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, అన్ని అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తల సహకారంతో జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. రానున్న 2029 ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో తీసుకురావడానికి ప్రతి కార్యకర్త పట్టుదలతో కృషి చేయాలని సంజీవ్ ముదిరాజ్ కోరారు.

# జిల్లా డిసిసి కార్యదర్శులుగా మండల నాయకులు

జనరల్ సెక్రటరీగా బంగ్లా రవి, సెక్రటరీలుగా బంక వెంకటయ్య ,ఆనంద్ నియామకం



సెక్రటరీలుగా బంక వెంకటయ్య, ఆనంద్



జనరల్ సెక్రెటరీగా నియామకమైన బంగ్లా రవికి నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

**నవాబుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** జిల్లా డిసిసి కార్యదర్శిగా మండల కాంగ్రెస్ నాయకులు, కార్యదర్శులుగా మండల బంక వెంకటయ్య, ఆనంద్‌లు నియమితులైనట్లు మంగళవారం రాత్రి కాంగ్రెస్ నాయకుల సమక్షంలో ప్రకటించారు. పార్టీ పట్లవారు చూపిస్తున్న నిబద్ధతను గుర్తించిన జిల్లా అధిష్ఠానం ఈ బాధ్యతలను అప్పగించింది. మండల కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్న బంగ్లా రవీందర్‌కి జిల్లా డిసిసి జనరల్ సెక్రెటరీగా, బంక వెంకటయ్య ఆనంద్‌లను జిల్లా డిసిసి కార్యదర్శులుగా స్థాయి పదవి దక్కడం పట్ల నవాబుపేట మండల గ్రామ కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. సహకరించిన నియోజకవర్గ ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి, మాజీ డిసిసి అధికార ప్రతినిధి దుశ్యంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సమన్వయానికి పాటుపడతామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, పార్టీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

**మక్తల్ టౌన్, ఏప్రిల్8 ప్రభాతవార్త :** కర్ని ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, పరిపాలనపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధప్రభుత్వ అధికారుల వేషధారణలో మెరిశారు. తమకు కేటాయించిన బాధ్యతలను అత్యంత నిబద్ధతతో నిర్వహించిఅందరినీ ఆకట్టుకున్నారు. ఈవేడుకల్లో భాగంగా పాఠశాల హెడ్‌మాస్టర్‌గా సింధూజ, మండల విద్యాశాఖ అధికారిగా హైమత్, జిల్లా విద్యాశాఖ అధికారిగాకీర్తి బాధ్యతలు నిర్వర్తించగా, జిల్లా కలెక్టర్‌గా వినయ్ కుమార్ తనదైన శైలిలో విధులను నిర్వర్తించిఅందరి ప్రశంసలు అందుకున్నారు. ఉపాధ్యాయులుగా అఖిల, శిరీష, చందన, జయశ్రీ, ఉదయ్ శ్రీ,గీత, అధ్విత, అమృత,గౌతమి, హర్షవర్ధన్,హరీష్‌లుతరగతులు నిర్వహించి బోధనా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పిఇటిలుగా సావిత్రమ్మ, విష్ణురావన్, అటెండర్‌గా అఖిల్ తమ సేవలను అందించారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్‌గాయత్రి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో బాధ్యత పెరిగి, సమాజం పట్ల గౌరవం, భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ చైర్మన్ పద్మమ్మ, ఉపాధ్యాయులుడి.వెంకటేష్,రమ్య,ప్రతిభ, కల్పనలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. చిన్నారుల ప్రతిభను చూసి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేయడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది.

# గార్లపల్లి గ్రామస్తుల రాస్తారోకో



రోడ్డుపై బైఠాయించిన గార్లపల్లి గ్రామస్తులు

**మక్తల్ టౌన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** కొత్త గార్లపల్లి గ్రామంలో గ్రామ దేవత లక్ష్మీదేవి దేవాలయ నిర్మాణం చేసుకోవాలని గ్రామస్తులు ఇటీవల భూమి పూజ చేసి, నిర్మాణ నిర్మాణ పనులు ప్రారంభించగా నిర్వాసిత గ్రామ సర్వే నెంబర్‌కి పక్క పొలం వ్యక్తి తమ పొలాన్ని ఆక్రమించుకున్నారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు గ్రామస్తులను బెదిరించడం గ్రామస్తుల రోడ్డు పై రాస్తారోకోకు దారి తీసింది. ముంపు గ్రామం అయిన కొత్త గార్లపల్లి లో ప్రభుత్వం ఇచ్చిన భూమిలో గ్రామస్తులందరూ గుడి కట్టడానికి వెళ్ళగా పోలీసులు ఆ స్థలంలో గుడి నిర్మాణం వద్దని చెప్పడంతో కొత్త గార్లపల్లి గ్రామస్తులు మక్తల్ పట్టణం చేరుకొని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. అరగంట పాటు రోడ్డు దిగ్బంధం చేయగా పోలీసులు జోక్యం చేసుకొని సమస్య పరిష్కారం కోసం తహశీల్దార్ ను కలిసి సమస్య పరిష్కారం చేసుకోవాలని ఎస్సై భాగ్యలక్ష్మీ రెడ్డి స్పష్టం చేశారు . దీంతో గ్రామస్తులు తహశీల్దార్ కార్యాలయం వద్ద గార్లపల్లి గ్రామస్తులు బైఠాయించడంతో రెండు రోజుల్లో సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామని తహశీల్దార్ సతీష్ కుమార్ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు వారి ధర్నా విరమించారు. ముంపు గ్రామానికి గురైన కొత్త గార్లపల్లి వారికి కేటాయించిన సర్వే నంబర్లలో ఇళ్ల నిర్మాణంతో పాటు బడి, గుడి, ప్రజా అవసరాలకు సంబంధించిన నిర్మాణాలు చేపట్టాలని నియమం ఉంది. త్వరలో సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామని అప్పటి వరకు ఇరు వర్గాల వారు గొడవ పడకుండా ఉండాలని తహసిల్దార్ సూచన చేశారు.

# హిందూ బంధువులారా తరలిరండి

## నేడు జడ్చర్లలో హిందూ సమ్మేళనం

**జడ్చర్ల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** రాష్ట్రీయ స్వయంసేవకు సంఘ్ శతవసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం జడ్చర్లలోని గౌడ ఫంక్షన్ హాల్లో హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు రంగారావు తోట హిందూ సమ్మేళన ఉత్సవ సమితి సభ్యులు తెలిపారు. ఈ మేరకు గత కొన్ని రోజులుగా ప్రతిగడపగడపకు కరపత్రాలను పంపిణీ చేశారు. గురువారం సాయంత్రం సాయంత్రం 5గంటలకు నిర్వహించే ఈ సమ్మేళనంలో ప్రతి ఒక్క హిందూ బంధువులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



# ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**శ్రీరంగాపూర్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** ప్రభుత్వ కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన మండలాల్లో నూతన కార్యాలయ భవనాల ఏర్పాటుకు కృషి చేస్తోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయభవనాన్ని బుధవారం వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిరిబ్బన్ కట్ చేసి కార్యాలయంలోపూజా కార్యక్రమం నిర్వహించి ప్రారంభించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం పక్కనే రూ.5 లక్షల వ్యయం తో నిర్మించిన ఇందిరమ్మ నమూనా గృహంలో ఏర్పాటుచేసిన గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ.88లక్షల వ్యయంతో చేపట్టనున్న అదనపు మౌలిక సదుపాయాలనిర్మాణ పనులకు శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్తగా ఏర్పడిన మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో జిల్లాలోని పలు మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు అద్దె భవనాల నుంచి సొంత భవనాలకు మారడం సంతోషకరమన్నారు. ఇప్పటికే ఏదుల, రేవల్లి మండల కేంద్రాల్లో నూతనతహసిల్దార్ కార్యాలయ భవనాలను ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణం కోసం ఒక్కో భవనానికి రూ.32 లక్షలను కలెక్టర్ తన సొంత నిధులనుంచి కేటాయించి వేగంగా పూర్తి చేయించడం అభినందనీయమని తెలిపారు. ఈ కొత్త భవనాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు.



తహసీల్దార్ కార్యాలయం ప్రారంభించిన వనపర్తి ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

**అంగన్‌వాడీలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ:** అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులకు ముఖ్యమైన సేవలు అందిస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారులతో సమన్వయం, సమాచారం వేగంగా చేరవేయడం వంటిఅంశాల్లో మొబైల్‌ఫోన్లు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అందుకే అంగన్‌వాడీలకు 538 కొత్త 5జి స్మార్ట్ ఫోన్లను అందజేయడంజరిగిందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు కూడా ఈ సదుపాయంకల్పించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. మొబైల్ ఫోన్ల ద్వారా తమ విధులు మరింత సులభంగా నిర్వహించ గలమని వారుపేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సర్పంచి మద్దిలేటి, డీఈఓ అబ్దుల్ ఘని, బిడబ్ల్యుఓ సుధారాణి, తహసిల్దార్ వరలక్ష్మి,మాజీ జెడ్పిటిసి రాజేంద్రప్రసాద్, నాయకులు శ్రీహరిరాజు, ఇతర అధికారులు తదితరులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీలకు స్మార్ట్‌ఫోన్లు అందజేసిన ఎమ్మెల్యే, కలెక్టర్

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**పెబ్బేరు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. పెబ్బేరు చుట్టూ పక్కల పరిధిలో మొక్కజొన్న రైతుల సౌకర్యార్థం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను సంప్రదించి పెబ్బేరులో మొదటిసారి మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం మొక్కజొన్న రైతులకు రూ. 2400 మంచి మద్దతు ధర కల్పిస్తోందని, రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయవర్ధన్‌రెడ్డి, కమిటీ డైరెక్టర్లు కాంగ్రెస్ నాయకులు ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది

■ దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన వార్త పత్రికతో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యాశాఖను గాలికి వదిలేసిందని, విద్యపై అధికదృష్టిని కేంద్రీకరించి, విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నారని తెలిపారు. గత ఎన్నికల్లో నేను ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ,పలు పాఠశాలలను సందర్శించి, మౌలిక వసతులు ఏర్పాటుతో పాటు కాలినడకన వెళ్లే విద్యార్థులకు సైకిల్ ఇవ్వడం జరిగిందని,అదేవిధంగా నియోజకవర్గ వ్యాప్తంగా 6 నుండి పదవ తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్స్‌తో పాటు టై,బెల్టు పంపిణీ చేస్తు న్నామని తెలిపారు. విద్యా పరంగా ఎలాంటి సహకా రానైనా అందించేందుకు ఎల్ల వేళలా సిద్ధంగా ఉన్నానని జీఎంఆర్ తెలియజేశారు. అంత ర్జాతీయ స్థాయి విద్యను అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి నియోజకవర్గానికి యంగ్ ఇండియాఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుచేశారని, అంతేకాక దేవర కద్ర మండలంలోడిగ్రీ కాలేజ్‌ను తీసుకొచ్చామన్నారు. గతపదేళ్లలో బిఆర్ఎస్ చేయలేనిది, కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించిందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



# భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా శిక్షణ శిబిరం

**దామరగిద్ద, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలంలోని శిరిడి సాయిబాబా మందిరంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కావలి వెంకటేష్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర సంఘటన మంత్రి రాజారెడ్డి, రాష్ట్ర కోశాధికారి మాణిక్ రెడ్డి, పాలమూరు ఇంచార్జ్ గజేందర్ గౌడ్, రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సంఘటిత శక్తి ఎంతో అవసరమని అన్నారు. ప్రతి గ్రామంలో రైతులు సంఘాలుగా ఏర్పడి,గ్రామ,మండల,జిల్లా స్థాయిలో కమిటీల ద్వారా ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లితే పరిష్కారం సాధ్యమవు తుందని వివరించారు. రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టి భూములను సారవంతం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. సంఘం నియమ నిబంధనలు పాటిస్తూ గ్రామాల ఆర్థికాభివృద్ధికి రైతు కుటుంబాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే దేశానికి నిస్వార్థంగా ఆహారం అందించడం రైతుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో వివిధ గ్రామాలకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు, మండల నాయకులు, జిల్లా కమిటీ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి

# బ్యాంకులు, ఏటీఎంల వద్ద అప్రమత్తత ఉండాలి

## సీఐ శివశంకర్

**నారాయణపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో బుధవారం పోలీసులు బ్యాంకులు, ఏటీఎంల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. అధికారులు పలు బ్యాంకులను సందర్శించి కస్టమర్లకు భద్రతపై అవగాహన కల్పించారు. నగదు లావాదేవీల సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు బ్యాంకులు, ఏటీఎంల వద్ద రద్దీ ఎక్కువగా ఉండటంతో దొంగలు కస్టమర్లను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా పెద్ద మొత్తంలో నగదు తీసుకునే వారిపై నేరగాళ్లు కన్నేస్తున్నారని హెచ్చరించారు. ఏటీఎం వద్ద అపరిచితులకు కార్డులు ఇవ్వకూడదని, పిన్ నెంబర్ ఎవరితోనూ పంచుకోరాదనిసూచించారు. అపరిచితుల మాటలు నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారుఅధిక మొత్తంలో నగదు తీసుకెళ్తున్నప్పుడుఒంటరిగా కాకుండా ఇద్దరు లేదా ముగ్గురు కలిసి వెళ్లాలని తెలిపారు. డబ్బులు తీసుకున్న వెంటనే నిరక్ష్యం చేయకుండా భద్రంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలు జరిగితే వెంటనే 1930 టోల్ ఫ్రీనంబర్‌కు సమాచారంఇవ్వాలని సూచించారు ప్రజలు అప్రమత్తంగాఉంటేనే నేరాలనునివారించగలమని పోలీసులు తెలిపారు.



బ్యాంకులు, ఏటిఎంల వద్ద అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్న పోలీసులు

# గ్రామపంచాయతీ కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలి

**నారాయణ పేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల అక్రమ తొలగింపులను తక్షణమే ఆపాలని టీయూసీఐ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు కొత్తగా బాధ్యతలు చేపట్టిన కొంతమంది సర్పంచ్‌లు కార్మికులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. కులం, పార్టీ, వ్యక్తిగత అభిప్రాయాలు వంటి కారణాలు చూపిస్తూ తొలగింపులు జరుపుతున్నారని విమర్శించారు. ఏళ్ల తరబడి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కార్మికులపై ఇలాంటి చర్యలు అన్యాయమన్నారు. గ్రామాలను శుభ్రంగా ఉంచడంలో కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. 18 సంవత్సరాలుగా తక్కువ జీతంతో పని చేసిన కార్మికుల పరిస్థితిని గుర్తించాలని కోరారు. ప్రస్తుతం పెరిగిన వేతనం కూడా సరిపోని పరిస్థితి ఉందని తెలిపారు. సర్పంచ్‌లు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ తొలగింపులు పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం ప్రయోగించినట్టు" ఉన్నాయని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో పలు గ్రామాల పంచాయతీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న టియుసిఐ నాయకులు

## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

**ధన్వాడ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని గున్ముక్ల గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి ఆదేశాల మేరకు వారి వ్యక్తిగత సహాయకుడు చిట్టెం మాధవరెడ్డి ఈ కార్యక్ర మాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి మౌలిక వసతుల పెంపు ఎంతో అవసరమని నాయకులు పేర్కొన్నారు. సీసీరోడ్డు నిర్మాణంతో గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం మెరు గుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ చంద్రనోళ్ల అనంతమ్మ, ఉప సర్పంచ్ నర్సింలు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరహరి, గ్రామ కాంగ్రెస్ నాయకులు అయ్యప్పరెడ్డి,నరసింహారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రవీందర్ బాబు, కె.బాలయ్యగౌడ్, జే.ఆంజనేయులు గౌడ్, నారాయణరెడ్డి, పి.శ్రీరామ్ రెడ్డి, బి.రఘు గౌడ్, అశోక్‌గౌడ్, బాలయ్య, వార్డ్ మెంబర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



# భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు

**రేవల్లి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రేవల్లి మండల కేంద్రంలో మాజీ జడ్పిటిసి కార్యాలయంలో మండల విలేకరుల సమావేశంలో నిర్వహించారు. మాజీ జడ్పిటిసి భీమయ్య మాట్లాడుతూ ప్రజల మీద రైతుల మీద అభిమానం ఉన్నప్పుడు రాష్ట్ర బాగోగులు రైతుల లాభ క్షేమాలు చూసినప్పుడు రిజర్వాయర్ నిర్మాణం చేయొద్దని రైతులు అడుగుతున్నప్పుడు ఎమ్మెల్యే మెఘా రెడ్డి నిర్మాణం చేయ వద్దు కదా అని ఆరోపించారు. గత ప్రభుత్వం గొల్లపల్లి చీర్క పల్లి జీవోను చేసినప్పటికిని 2018, 19 నెలలో నే గత టిఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిందని, అలాంటప్పుడు ఈ ప్రభుత్వం మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రిజర్వాయరును తిరిగి ఏర్పాటు చేయాలని రైతులను నష్టానికి గురి చేసే విధంగా ఈ రిజర్వాయర్ ఏర్పాటు చేస్తున్నారని ఆయన అన్నారు. అఖిలపక్ష దీక్ష ఒక్క టిఆర్ఎస్ పార్టీ పరంగా దీక్ష చేయడం లేదు. సిపిఐ సిపిఎం డిఎస్పి ఇతర పార్టీల మద్దతు ప్రకారంగానే ఈ దీక్ష కొనసాగుతుందనిఆయన తెలిపారు. నేటికీ నూట ఒక్కరోజు అవుతున్న స్థానిక ఎమ్మెల్యే దీక్ష శిబిరానికి వచ్చి ఒక రైతు దగ్గర మాట్లాడింది లేదని మాజీ జడ్పిటిసి సభ్యులు భీమన్న ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు కురుమూర్తి రెడ్డి,టిఆర్ఎస్ నాయకులుశివరాంరెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీరాములు, భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాములు, కృష్ణయ్య, కవి రాజు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

(మొదటి పేజీ తరువాయి)

స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లా ప్రజలు వైద్య సేవల కోసం హైదరాబాద్ వంటి నగరాలకువెళ్లి భారీ ఖర్చులు భరించాల్సిన పరిస్థితి నెలకొన్నదని, ఈ నేపథ్యంలో ఇక్కడే అధునాతన వైద్య సదుపాయాలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం జరగడం ఒక చారిత్రాత్మక ముందడుగని అన్నారు. ఆధునిక సాంకేతిక సదుపాయాలతో ఏర్పడనున్నఈ ఆసుపత్రి ద్వారాజిల్లాలో ఆరోగ్య సేవల ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయని తెలిపారు. చిన్న అనారోగ్య సమస్యలకే ప్రజలు లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని, పేద కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మహబూబ్ నగర్‌ను ఆరోగ్య రంగంలో అభివృద్ధి చెందిన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో పాటు మెడికల్ కాలేజీల స్థాపనదిశగా కూడా కృషి చేయాలని సూచించారు. ప్రజల సహకారం, సేవా సంస్థల భాగస్వామ్యం, ఎన్ఆర్ఐల మద్దతుతో ఈ లక్ష్యాలను సాధించవచ్చని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సహకారం కూడా పొందేందుకు ప్రయత్నిస్తామని, అవసరమైతే ఉన్నత స్థాయిలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థచైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, శ్రీ జయరామ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బెక్కెరి రాంరెడ్డి, కళ్యాణ్ , రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ లయన్ నటరాజ్, మద్ది అనంత రెడ్డి, మద్ది యాదిరెడ్డి,హేమంత్‌రెడ్డి, కార్పొరేటర్లు రమేష్ బాబు, పాండురంగ రెడ్డి, నాయకులు గోవింద్ యాదవ్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

(మొదటి పేజీ తరువాయి)

అదనంగా రూ.2 లక్షలు చొప్పున ఉదండాపూర్ నిర్వాసితులకు అదనంగా రూ.142 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. పెంచినఈ పరిహారంలో రూ.150 కోట్లు ఇటీవల విడుదల చేసింది. మరో రూ.200 కోట్ల వరకూ ఈ నెలలోనే విడుదల చేస్తామని కూడా హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే అనిరుధ్ రెడ్డి చేసిన కృషితో తమ జీవితాల్లో వెలుగు వచ్చిందని ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఉదండాపూర్ గ్రామ సర్పంచ్, డిప్యూటీ సర్పంచ్, వార్డు సభ్యులు, ఇతర నేతల ఆధ్వర్యంలో గ్రామస్తులు జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తమ పట్ల చూపిన ప్రేమాభిమానాలకుతాము ఎప్పుడూ రుణపడి ఉంటామని వారుపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉదండాపూర్ సర్పంచ్ తంగెళ్లపల్లి శేఖర్,డిప్యూటీ సర్పంచ్‌మ్యాతరి నరేష్, వార్డు సభ్యులు జహంగీర్, జ్యోతి శేఖర్, సుధారాణి, లింగం గౌడ్, పార్టీ నేతలు జడ్చర్ల మల్లయ్య, పాతింటి రామాంజనేయులు పాల్గొన్నారు.

# ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

**రేవల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** కెఎల్ ఐ కాలువలో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్ కర్నూలు జిల్లా పెద్దాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి రవికుమార్ (16) మంగళవారం స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. నీటి ప్రవాహానికి కొట్టుకుపోవడంతో కుటుంబ సభ్యులకు తెలిపారు. అప్పటికే గల్లంతైన విద్యార్థి లభ్యం కాక పోవడంతో బుధవారం గాలించగా ఉదయం రేవల్లి మండల పరిధిలోని తల్పునూర్ గ్రామ శివారులో గల కెఎల్ఐ కాలువలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

